క్లుప్తంగా

రేపు దివ్యాంగులకు మెగా హెల్త్ క్యాంపు

మన్ననూర్: ఆకార్ ఆశా ఆస్పత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పాలెం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఈ నెల 22వ తేదీ శనివారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తునట్లు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, వర్కింగ్ ప్రసిడెంట్ పర్రె ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శరీర పునర్నిర్మాణం, శస్త్ర చికిత్సల కోసం ఉచిత పరీక్షలు నిర్వహిస్తునట్లు వివరించారు. గ్రహణమొర్రీ, సరిగ్గా ఏర్పడని చెవులు, ముక్కు, కనురెప్పలు, అతుక్కొని ఉన్న వేళ్లు, వంపుతిరిగిన చెయ్యి, నిప్పు వల్ల ఏర్పడిన అంగవైకల్యానికి చికిత్స, కంతులు, గుడిపెలు తదితర వాటికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తునట్లు వివరించారు. అవసరమైన వారికి హైదరాబాద్‌లో శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు.

26న దళిత మృతవీరుల సంస్మరణ సభ

మన్ననూర్: అచ్చంపేట పట్టణంలోని టీఎస్ జీఏ భవనంలో 26న నిర్వహించే కారంచేడ్, చుండూరు, కల్వకోల్ దళిత మృతవీరుల సంస్మరణ సభలను విజయవంతం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) జిల్లా కన్వీనర్ ముద్దునూరి లక్ష్మీనారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు సీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ భూషణ్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్, ప్రధాన కార్యదర్శి అభినవ్ హాజరవుతారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లింగాల: మండలంలోని సూరాపూర్‌కు చెందిన సింగిల్ విండో మాజీ డైరెక్టర్ సీలం బాలస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం నిర్వహించిన దశదిన కర్మలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రైతుబీమాపై అవగాహన

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్ క్లస్టర్ పరిధిలోని రైతులకు రైతుబీమా పథకంపై గురువారం ఏఈఓ భరత్‌కుమార్ అవగాహన కల్పించారు. వెల్టూర్, కొరటికల్, తిప్పాపూర్, విగ్నేష్‌పూర్ గ్రామాల్లోని రైతులకు మొత్తం 399 మందికి రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని వివరించారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ జిరాక్స్ కాపీలను జతచేసి అందజేయాలని ఏఈఓ కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన టీవీలు



అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్యతో బుధవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. ఎస్సీ కాలనీలో వీధిలైట్లు, పలువురు ఇళ్లల్లో విద్యుత్ బల్బులు, టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. రాత్రి వేళ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: మండల కేంద్రానికి లక్ష్మయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని మాల మహానాడు సంఘం మహిళా సభ్యులు ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లాగా ఆయన స్పందించి రూ.10 వేలు అందజేశారు. అనంతరం వారు బాధిత కుటుంబానికి మహిళలు నగదులను అందజేశారు. కార్యక్రమంలో జాన్సీ, నవ్యశ్రీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన కాలే జంగయ్య, పల్స రామస్వామి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. అదేవిధంగా ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామస్వామి కుటుంబానికి రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు.

రాష్ట్ర కార్యదర్శిగా వంగ భాస్కర్‌గౌడ్

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి చెందిన వంగ భాస్కర్‌గౌడ్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా గురువారం నియామకం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు అప్రమత్తం



పెంట్లవెల్లిలో కురుస్తున్న వర్షం

కల్వకుర్తి టౌన్: కురుస్తున్న వర్షాలతో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. గురువారం ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి పర్యటించారు. కాలనీలలో తిరుగుతూ ప్రజలకు ఏవైనా సమస్యలున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరుతో పాటుగా, వర్షపునీరు ఎల్లికల్ రోడ్డులో ప్రవహించే చివరి ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రిడ్జిని దాటే సమయంలో వాహనదారులతో పాటుగా, పాదచారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య, ఎలక్ట్రీషియన్, టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని, మున్సిపల్ టోల్‌ఫ్రీ నెంబర్ 14420కు ఫోన్ చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ శివకృష్ణ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కొల్లాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో జనంజీవనం స్తంభించింది. మూడు మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. గురువారం రోజంతా ముసురు వర్షం కురిసింది.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా అంతర్గత రోడ్లతో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే లింకురోడ్లు బురదమయంగా మారాయి. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

పెంట్లవెల్లి: రెండు రోజులుగా ముసురు వర్షం కురిసింది. గురువారం మోస్తరు వర్షం పడింది. మండలంలోని కొండూరు, మంచాలకట్ట, మల్లేశ్వరం వెళ్లే ప్రధాన రహదారులపై రోడ్లపై గుంతలలో వర్షపునీరు చేరింది. ప్రధాన రహదారిపై మధ్యలో హైమాక్స్ లైట్ ఒకవైపు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. దిమ్మె కూడా ధ్వంసం కావడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు.

తెలకపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

కార్మికుల వినూత్న నిరసన



బిజినేపల్లిలో గడ్డి ఆకులు తిని నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ముసురు వర్షంలోనే సమ్మెలో పాల్గొన్నారు. కొల్లాపూర్‌లో సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లిలో ఒంటికాలిపై నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు కార్మికులకు పండ్లు అందజేశారు. బిజినేపల్లిలో గడ్డి ఆకులను తింటూ వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు తాడూరు, తెలకపల్లిలో ప్రభుత్వం స్పందించాలని నినాదాలు



తాడూరులో..

చేశారు. కోడేరులో జేజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కార్మికులకు మద్దతు తెలిపారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు వారికి సంఘీభావం ప్రకటించారు.

–సాక్షి, నెట్‌వర్క్

సెల్‌ఫోన్ల అప్పగింత

కల్వకుర్తి టౌన్: పలు కేసులలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు ఎస్‌ఐ రమేష్ వారి సెల్‌ఫోన్లను గురువారం బాధితులకు అందజేశారు. పట్టణానికి చెందిన కృష్ణయ్య, పర్వతాలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీఈఐఆర్ ద్వారా వాటిని గుర్తించి అందించారు. పోలీస్ సిబ్బంది శ్రీనయ్య, దావూద్, సుజ్ఞానంలను ఎస్‌ఐ అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కల్వకుర్తిరూరల్: అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్ అండ్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, అంజనయ్య, హన్మంతురెడ్డి, సుధాకర్, జగన్మోహనాచారి తదితరులు ఉన్నారు.

ఆర్డీఓకు సన్మానం



కల్వకుర్తిరూరల్: ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనును వివిధ పార్టీల నాయకులు గురువారం కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, మధు, ఆంజనేయులు, లింగం, మల్లేష్, వజ్రలింగం పాల్గొన్నారు.

మత్స్యశాఖ ఏడీకి..

కందనూలు: జిల్లా మత్స్యశాఖ ఏడీ డాక్టర్ లక్ష్మప్ప ఉత్తమ అవార్డు పొందడంపై గురువారం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సమీకృత భవనంలో జిల్లా మత్స్యకారులు సన్మానించారు. రాష్ట్రంలోనే సొసైటీల అభివద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారులు గూళ్ల హరికష్ణ ముదిరాజ్, తెలుగుపల్లె వెంకటయ్య ముదిరాజ్, కావాలి కష్ణ ముదిరాజ్, తాళ్లపల్లి అధ్యక్షులు మావిళ్ళ తిరుపతయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు...

మండల ఇన్‌చార్జ్‌గా శేఖర్

కల్వకుర్తిరూరల్: ఈ నెల 30న జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగ సన్నాహక సభకు మండల ఇన్‌చార్జ్‌గా పర్వపాకుల శేఖర్‌ను నియమించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాసులు హాజరై నియమించారు. కార్యక్రమంలో కృష్ణ, కిరణ్, నాని, సంతోష్, ఇష్ణు, నర్సింహ, కరన్, పరశురాము పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగిపై కేసు

బిజినేపల్లి: వినియోగదారుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బ్యాంక్ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు గురువారం పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ రాములు యాదవ్ వివరాల ప్రకారం నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన శ్రీరామ్ ఆర్యకు బిజినేపల్లి ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగి భానుప్రకాష్ పంట రుణం రెన్యూవల్ చేయాలని ఫోన్‌లో కోరగా ఇద్దరి మధ్య మాటమాట పెరగింది. బ్యాంకు ఉద్యోగి శ్రీరామ్ ఆర్యపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేస్తునట్లు ఎస్‌ఐ పేర్కొన్నాడు.

మణిపూర్ ఘటనలో బాధ్యులను శిక్షించాలి

కొల్లాపూర్: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలో బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు సంజు, సత్యం, గోవర్దన్, శివ, చందు తదితరులున్నారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన ఎమ్మెల్యే

కల్వకుర్తి: హైదరాబాద్‌లో మంత్రి హరీష్‌రావును గురువారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మూడెకరాల భూమిని సేకరించి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించామని వివరించారు. ఆమనగల్‌లో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన రూ.16 కోట్ల నిధులను విడుదల చేయాలని విన్నవించారు. ఆయన వెంట అర్జున్ రావు తదితరులు ఉన్నారు.

రజనికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ



కల్వకుర్తి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన దివంగత సాయిచంద్ భార్య రజనికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు రజనిని మర్యాద పూర్వకంగా కలిశారు.

ఫేక్ ఐడీపై ఫిర్యాదు

వెల్దండ: ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేరున గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్‌ఐడీ సృష్టించిన వారి చర్యలు తీసుకోవాలని గురువారం ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ తప్పుడు ఐడీతో ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ అనుచరుడిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో రెండు వర్గాలు చెందిన వారు ఒకరిపై ఒకరు సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టారు. నాగనూలు గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అనుచరుడు కృష్టారెడ్డి అదే గ్రామానికి చెందిన సాయికృష్ణకు ఫోన్ చేసి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సాయికృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ

ఈవీఎంలపై అవగాహన

కల్వకుర్తిరూరల్: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను సమావేశం నిర్వహించారు. అనంతరం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, టీడీపీ, మజ్లిస్, పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ముట్టడి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్లకు కనీస వేతనం రూ.27 వేలు ఇవ్వాలని సీఐటియూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 160 మంది స్వీపర్లు కేవలం రూ.1623ల వేతనంతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి గౌడ్, కార్యదర్శి వెంకటయ్య గౌడ్, నాయకులు బాలస్వామి, రామేశ్వరమ్మ, అలివేల, నారాయణగౌడ్, నిరంజన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

కోడేరు: పారదర్శకంగా ఓటరు జాబితా ఉండాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేవిధంగా అవగాహన కల్పించారు. అదే విధంగా మృతి చెందిన, వలసలు వెళ్లిన వారి వివరాలను సేకరించి ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓలు వరలక్ష్మి, శిరీష, స్వాతి, నాగమణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను కొనసాగించాలి

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ కళాశాల విద్యార్థులు తహసీల్దార్ రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి విన్నవించారు. అధ్యాపకులు లేక సిలబస్ పూర్తి కావటంలో ఆలస్యం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం

అచ్చంపేట రూరల్: బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థిగా అమ్రాబాద్ ప్రాంతానికి చెందిన శ్రీశైలంను రాష్ట్ర కమిటీ ప్రకటించింది. గురువారం పట్టణంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎంఎం గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడారు. బహుజనుల రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



పెద్దకొత్తపల్లి: ఆటో డ్రైవర్లకు, కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఏసయ్య డిమాండ్ చేశారు. మండలంలోనా కల్వకోల్‌లో ఏఐటీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఆటో కార్మికుల కోసం రూ.20 లక్షల సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి శివశంకర్, రాముడు, శేఖర్, రాజు, కార్తీక్, బాబు,రేణు తదితరులు పాల్గొన్నారు.

పీర్ల చావిడి ప్రారంభం

లింగాల: మండలంలోని కొత్తచెర్వుతండాలో నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిని దాత మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ బుధవారం రాత్రి ప్రారంభిచారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు అంకుల్, జనార్దన్, మాజీ సర్పంచ్ మల్లయ్య, జైపాల్‌రెడ్డి, రేణయ్య, మాసిరెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలంపై విచారణ



వెల్దండ: మండలంలోని తుంకిబండతండాకు సంబంధించిన ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కొంత మంది కబ్జా చేశారు. గురువారం రెవెన్యూ అధికారులు, పోలీసులు, విద్యాశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పాఠశాల స్థలంలో ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలను తొలగించారు. పూర్తి సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్, ఆర్ఐ శంకర్, సర్వేయర్ అనసూయ, క్లస్టర్ హెచ్ఎం రాజశేఖర్, కవిత, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణ పరిశీలన



చారకొండ: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు ప్రభుత్వం 59 జీఓ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారి నివాసాలను క్రమబద్ధీకరణ కోసం అధికారులు పరిశీలించారు. మండలంలోని సిర్సనగండ్ల, చారకొండ గ్రామాల్లో గురువారం అధికారులు దరఖాస్తు చేసుకున్న 34 మంది నివాసాల యజమానుల వివరాలను సేకరించి, పరిశీలించారు. ఉన్నత అధికారులకు వివరాలను అందిస్తామని మైనింగ్ ఏడీ నాగేష్ తెలిపారు. వెల్దండ డీటీ శ్రీనివాస్ రావు, చారకొండ ఆర్ఐ నబి ఉన్నారు.

అంతిమ పోరాటానికి సిద్ధం

అచ్చంపేట రూరల్: వర్గీకరణ ఆశయ సాధనలో అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మహేష్ మాదిగ కోరారు. గురువారం పట్టణంలో ఎంఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్, పవన్, సురేష్, మల్లేష్, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని మాదిగ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు శ్యాం ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రస్తుత వర్షాకాల సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలని లేదా భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరేష్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎరమోని యాదగిరి మాదిగ, జిల్లా ఇన్‌చార్జ్ బకరం శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వర్గీకరణ సాధన కోసం త్వరలో మాదిగల విశ్వరూపం మహాసభ నిర్వహిస్తామన్నారు. నాయకులు గూట విజయ్‌మాదిగ, సొట కాశీం, సంపంగి మద్దిలేటి, సులిగిరి శ్రీనివాసులు, వడ్డెమాన్ రాములు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

కొల్లాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ బాట సింగారంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలించేందుకు మండల బీజేపీ నాయకులు వెళ్తారన్న సమాచారంతో గురువారం పోలీసులు వారిని ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, కృష్ణ, కాశీపురం మహేష్, శివకృష్ణ, చరణ్ తదితరులున్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బీజేపీ నాయకులు దుర్గాప్రసాద్, నర్సింహ, సురేందర్‌గౌడ్, అభిలాష్ రెడ్డి, విజయ్, రవిగౌడ్‌లతోపాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఉప్పునుంతల: మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

లింగాల: మండల పార్టీ అధ్యక్షుడు సలేశ్వరం, నాయకులు యాదయ్య, విష్ణు, అశోక్ తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: పోలీసుల అదుపులో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల్ శివుడు, వెంకటయ్య, మల్లేష్, లింగస్వామి, ప్రవీణ్ ఉన్నారు.



కొల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో నాయకులు

వెల్దండ: బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, జిల్లా స్పోక్‌పర్సన్ రామస్వామి, ఎంపీటీసీ చక్రవర్తిగౌడ్, రంగరాతి శ్రీశైలం, యాదయ్య, రాజు, శివ ఉన్నారు.

కోడేరు: సొప్పరి రామకృష్ణ, మహేష్ లను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్యం

కొల్లాపూర్/రూరల్: నియోజకవర్గ అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జోనల్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోడబండ తండా, సున్నపుతండా, చుకాయపల్లిలో గడప గడపకు బీజేపీ నిర్వహించారు.

గేట్‌వాల్వ్ లీకేజీ.. తాగునీరు కలుషితం

బల్మూర్: మండలంలోని కొండనాగులలో ప్రధాన రహదారి సంతబజారులో ఉన్న తాగునీటి పైపులైన్ గేట్‌వాల్వ్ లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. రెండు నెలల నుంచి లీకేజీ కారణంగా నీళ్లు రోడ్డుపై పారుతోందని దీంతో పాటు వాల్వ్ గుంతలో పేరుకుపోయి పైపులైన్ ద్వారా నల్లాల కనక్షన్ల నుంచి వస్తున్నాయని వాపోతున్నారు. కలుషితమైన తాగునీరు తాగుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సిబ్బంది స్పందించి గేట్‌వాల్వ్‌ను సరి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్

తెలకపల్లి: నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ పేరుగాంచిందని టెక్నికల్ ఇంజినీర్ కొత్త సునీల్ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలో మహాలక్ష్మి ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ సాంకేతిక ప్రమాణాలను గురించి వివరించారు. మార్కెట్‌లో ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అవుతాయని, స్లాబ్, కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీయర్‌లు సైట్ వద్దకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. అనంతరం 50 మంది మేస్త్రీలకు ఉచితంగా రూ.లక్ష ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. భారతీ సిమెంట్‌ను యాలాద్రి దేవాలయ నిర్మాణానికి, ఆలేరు, వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ప్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వినియోగించారని వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ విజయ్‌బాబు, డీలర్ ప్రణవ్‌రెడ్డి, సత్యనారాయణ, మేస్త్రీలు పాల్గొన్నారు.



మేస్త్రీలకు ప్రమాదబీమా పత్రాలు అందజేస్తున్న భారతి సిమెంట్ అధికారులు

ఉపాధి కూలీలతో వెట్టిచాకిరి తగదు



తాడూరు: ఉపాధి కూలీలతో వెట్టిచాకిరి చేయించడం తగదని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో కూలీలతో మాట్లాడారు. వారం రోజులకు కలిపి 600–1000 మాత్రమే కూలీ వస్తుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విజయం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం ఒక రోజు కూలీ కనీసం రూ.275లు తక్కువ కాకుండా ఇవ్వాలన్నారు. రోజుకు 80–120 రూపాయలు మాత్రమే శ్రమదోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, దామోదర్, రాజశేఖర్‌లతో పాటు కూలీలు ఉన్నారు.